వయస్సొచ్చిన మనస్సు

మైనంపాటి భాస్కర్



పెళ్ళికొడుక్కి ప్రెజెంటేషన్ కొనాలి.

అబిడ్స్‌కి వెళ్ళాం. నాకు తోడుగా మనోహర్. వాడు మా అన్నయ్య కొడుకు. ప్రెజర్ కుక్కరొకటి కొన్నాను.

"నెక్స్ట్ నీ మారేజ్ కొట్టోలు! పెళ్ళిచేసుకొని స్టేట్స్‌కి వెళతావా? తిరిగి వచ్చాక చేసుకుంటావా? లేకపోతే అక్కడే ఎవర్నన్నా చేసేసుకుంటావా?" అన్నాను.

వాడు ఎలక్ట్రానిక్స్‌లో యూనివర్సిటీ పెకండు వచ్చాడు. స్కాలర్‌షిప్ మీద టెక్సాస్ యూనివర్సిటీలో చదవడానికి వెళుతున్నాడు. సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా, అందమైన అమ్మాయి లాగా ఉంటాడు.

"ముందు నీ పెళ్ళి కానియ్యి బాబాయ్! తర్వాత నా సంగతి ఆలోచిద్దాం" అన్నాడు వాడు వేళాకోళంగా వాడికి నా దగ్గర చనువెక్కువ.

పెళ్ళి అన్నమాట వింటే నా మనస్సు బరువెక్కిపోతుంది.

పాతికేళ్ళ కిందట .... అంటే నాకు పాతికేళ్ళు నిండడానికి ఇంకా అయిదేళ్ళున్నప్పుడు....

....ఇదో ఈ ఊళ్ళోనే,....లత అని ఒక దేవత....ప్రబంధాల్లో వర్ణించినట్లు నెమళ్ళకు అందంగా నడవడం నేర్పుతూ కోయిళ్ళకు తియ్యటి మాటలు నేర్పుతూ, చందమామకు చల్లగా ఉండడంలో ట్రెయినింగ్ ఇస్తూ ఉండేది.

లత ....

లతలాగే సన్నగా, తెల్లగా, అందంగా,

లతని నేను ప్రేమించడానికి లక్ష కారణాలున్నాయ్. అయితే లత నన్ను ప్రేమించడానికి వెదికి చూసినా ఒక్క కారణమూ కనబడదు.

కానీ ప్రేమించింది.

అదృష్టమా?

దానికీ నాకూ చాలా దూరం.

ఆ లతతో నాకు పరిచయం లేకపోతే, లత నన్ను ప్రేమించకపోతే, లత నా ప్రేయసి కాకుండా కేవలం ఆరాధ్య దైవంగా మాత్రమే ఉండి ఉంటే....

ఈనాడీ రంపపుకోత ఉండేది కాదు

"పెద్దవాళ్ళకిష్టంలేదని తేలిపోయింది మనం పెళ్ళి చేసేసుకుందాం." అంది లత, ధైర్యంగా.

ఆ ధైర్యం నాకు లేకపోయింది.

"కాదు లతా! ముందు ఉద్యోగం దొరకాలి మన కాళ్ళమీద మనం నిలబడగలగాలి. అప్పుడే పెళ్ళి" అన్నాను

చదివిన చదువుకి ఇంకే ఉద్యోగాలు దొరక్క, ఆర్మీలో చేరాను నార్తిండియాకి వెళ్ళిపోయాను.

అప్పుడు జరిగిపోయింది ఘోరం!

ఈ లతని బలవంతంగా ఒక మోడుకి అల్లించారు వాళ్ళ పెద్దవాళ్ళు

ఆ పిల్ల ఏం చేస్తుంది? నాకు ఉత్తరం రాసే ఉంటుంది. రాసి ఉండాలి కానీ నాకు చేరలేదు.

ఆ తర్వాత నేను ఇటువైపు రాలేదు థార్ ఎడారి అంచుల్లో, ఆ వేడిలో, భగ్నమైన ప్రేమ సెగలో, జీవితమంతా కాల్చేసుకున్నాను.

కిందటి నెలే రిటైరయ్యాను.

తరం మారుతోంది. అన్నయ్య పెద్దకొడుకు పెళ్ళి.

ఇన్నాళ్ళకు మళ్ళీ నా ఊరు. నా బంధువులు. ముసలాళ్ళు మరి లేరు.

పెద్దవాళ్ళు ముసలాళ్ళయ్యారు.

పిల్లలు పెద్దాళ్ళయ్యారు.

నే నెరగని పిల్లలు చాలామంది ఉన్నారు

ఊరు చేరగానే ఊపిరి ఆగిపోయేలా తెలిసిన వార్త—లత రెండేళ్ళ క్రితం పోయిందట

* * *

పెళ్ళి హడావిడిలో

చటుక్కున షాక్ కొట్టినట్లయింది.

లత .... ఇరవై, ఇరవై రెండేళ్ళ లత....అచ్చం అలాగే... ఇది నిజమా? ఇది సంభవమా?

"ఏమిటలా చూస్తున్నావ్? మా అమ్మాయే! లావణ్యా! మామయ్య. ఆర్మీలో ఉంటున్నారని చెప్పలేదూ?" అంది రుక్మిణి.

లావణ్య! రుక్మిణి కూతురు! అంటే వరసకు నా మేనకోడలు ఒక్క క్షణం సేపు లతా అనుకున్నాను. మనిషిని పోలిన మనుషులుండటం అంటే ఇదే!

లావణ్య నాజూగ్గా ఉన్న చేతులెత్తి నమస్కారం పెడుతూ దగ్గరకొచ్చింది.

భుజంమీద చెయ్యేశాను.

"నువ్వు పుట్టిన తర్వాత ఇప్పుడే చూస్తున్నా లావణ్యా!" అన్నాను. గొంతు తెలియని దుఃఖంతో పూడుకు పోయింది.

* * *

లావణ్య పేరు మాత్రం అతికినట్లు సరిపోయింది బంగారపు తీగెలా, చీకటి రాత్రిలో మెరుపులా, సన్నగా, పొడగ్గా లావణ్య

లావణ్య పందిట్లో తిరుగుతూ ఉంటే చాలామంది తననే తదేకంగా చూడడం గమనించాను

సహజం

అందమైన ఆడపిల్ల

వాళ్ళ అమ్మ తాలూకు ఆస్తీ, నాన్న తాలూకు హోదా ఆ అమ్మాయికి నిబ్బరాన్ని తెచ్చి పెట్టాయో గానీ, గర్వాన్ని ఇవ్వలేదు.

ఎమ్మెస్సీ చదువుతోంది. తర్వాత రిసెర్చి చేస్తుందిట. తనే చెప్పింది.

తను వడ్డనలోకి వస్తే అందరూ మారు వడ్డించుకుని, ఏవేవో ప్రశ్నలేసి, తొందరగా కదలనివ్వరు.

మనోహర్ మరీనూ.

"ఇంకో లడ్డు వెయ్యి." అన్నాడు. ఆమె చేతిలో ఉన్నది పులుసు గిన్నె.

వెళ్ళి లడ్లు తెచ్చింది.

"ఇందాక వంకాయ కూర అడిగాను. వెయ్యలేదు." నిష్ఠూరంగా అన్నాడు.

తెచ్చి వేసింది.

"నెయ్యి"

ఒక్కసారి కోపంగా చూసి, అంతలోనే నవ్వేసింది.

"నెయ్యి మళ్ళీ నేను తెచ్చేదాకా కూర్చో తొందర్లేదు." అని నవ్వుతూనే పక్కకి జరిగిపోయింది

బంగారం రంగు పట్టుచీరె కుచ్చెళ్ళు



ఒకవైపు ఎత్తి బొడ్లో దోపుకుంది. పచ్చటి పాదాలు వాటిమీద జీరాడుతున్న తెల్లటి పాల నురుగులాంటి పరికిణీ.

నెయ్యి తెచ్చి గిన్నెతో విస్తట్లో ఒంపేసింది. "ఏయ్! ఏమిటది? చాలు. చాలు." అన్నాడు మనోహర్ కంగారుగా.

"అడిగావు. వేస్తున్నాను."

ఈడూ జోడూ కుదిరిన కుందేళ్ళ జంటో, లేళ్ళ జంటో ఒకదాన్ని ఒకటి తరుముకుంటూ సరదాగా ఆడుకుంటున్నట్లు ఉంది చూసే వాళ్ళకి

"ఎప్పుడు నువ్వు స్టేట్స్ కెళ్ళేది?" అని పలకరిస్తున్నాడెవరో బంధువు.

"పెళ్ళి చేసుకుని దాన్ని కూడా తీసుకెళ్ళ మంటున్నాం." అంది మా వదిన మనోహర్ తల్లి

ఆ సంభాషణలో పేర్లు దొర్లక పోయినా, పెళ్ళి జరగాల్సింది మనోహర్ లావణ్యలకని అక్కడున్న వాళ్ళకందరికీ చెప్పకుండానే అర్థమవుతోంది

ఆ క్షణంనుంచీ లావణ్య ఆ పరిసరాల్లో కనిపించడం మానేసింది.

సిగ్గు! యూనివర్సిటీ చదువులు చదివినా! భోజనం చేస్తూ ఒకసారి చుట్టూ చూశాను.

చివరి పంక్తి.

అందరూ దగ్గర బంధువులు అందరూ పెద్ద పెద్ద హోటాల్లో కొచ్చారు. ఉద్యోగాలు చెయ్యని వాళ్ళు వ్యాపారాల్లో బాగా సంపాదించుకుని ఆస్థులు కొన్నారు.

ఎవరి దీవెనవల్లో గాని బాగుపడ్డాయి మా కుటుంబాలు.

ఒక్క నరహరి తప్ప

నరహరి నాకు కజిన్ అవుతాడు. అదేదో ఆఫీసులో గుమస్తా. అదేం ఆఫీసో — నీ పాతికేళ్ళయినా ప్రమోషన్ లేదుట. అలాగే ఉన్నాడు. సంసారం పెద్దదయింది. కొడుకు మూర్తి బియేదాకా చదివి తనూ ఓ గుమస్తా ఉద్యోగం సంపాదించి తండ్రికి సాయపడుతున్నాడు. వాడు చాలా తెలివైనవాడు — మనోహర్ చెప్పాడు.

"వాడికి ఇంట్లో శాంతి ఉంటే కదా పైకి వస్తూ ఉండేవాడు బాబాయ్! ఇంట్లో రోజూ ఏదో రకం గొడవ. వాడి కెరీర్ పాడయిపోయింది" అన్నాడు వాడు.

మూర్తి నెరిగిపోలేదు కాని బాగు పడనూ లేదు. నేను వచ్చినరోజు పలుకరించాను... మళ్ళీ మాట్లాడదామంటే కనబడటమే లేదు. వాడు.

ఉంటే వంటపాకలో ఉంటాడు. లేకపోతే సైకిలేసుకుని బజారుపన్లు చేస్తుంటాడు.

పెళ్ళి దాదాపు వాడి చేతిమీదే జరుగుతోంది.

ఒక్కొక్క క్షణం ఒక్కొక్క మూల, ఒక్కొక్క రూపంతో కనబడుతుంటాడు.

తెలివైనవాడు. అందరూ అదే అన్నారు." అయితేనేం. అదృష్టం లేదు.

నా భ్రమ అయి ఉండవచ్చు. లావణ్య ఎక్కడ ఉంటే, ఆ ప్రాంతాలకు వాడు తరచుగా వస్తున్నట్లనిపించింది.

"లావణ్యా! కాస్త తమలపాకులు అందుకో!" అని ఎవరన్నా కేకవేస్తే, లావణ్య చేతిలో ఓ కట్ట తమలపాకులు కుక్కేసి ఆ క్షణం మాయమయ్యేవాడు మూర్తి. లావణ్య తన ఫ్రెండ్సుని టిఫెన్‌కి తీసుకొస్తే, కాఫీ గంగాళం దగ్గర వీడు సిద్ధం!

వాడి పద్ధతులు క్షమించాను నేను.

వాణ్ణి చూస్తే జాలివేసింది. లావణ్య అపురూపమైన అందగత్తె. వీడు పెద్దగా బావుండడు! బిగుతుగా ఉన్న ప్యాంటూ, కొద్దిగా పాతబడ్డ షర్టూ, అదో రకంగా ఉంటాడు.

అయినా, మనిషన్న తర్వాత ఆశ సహజం!

క్షమించాను వాణ్ణి — లావణ్యని పూసుకు పూసుకు తిరుగుతున్నా!

* * *

పెళ్ళయిపోయింది.

బంధువులం మాత్రమే మిగిలాం.

చిరుచీకటి పడుతుండగా, డాబామీదికి ఎక్కాను.

లావణ్యా, మనోహర్ కూర్చుని ఉన్నారు. ఇంకెవరూ లేరు.

ఏం చెయ్యాలో తోచలేదు. వెనక్కి తిరిగిపోదాం అనుకున్నాను.

మరి వాళ్ళేం అనుకుంటున్నారో

చీకటివల్ల మొహాల్లో భావాలు కన బడటం లేదు.

"రా బాబాయ్!" అన్నాడు మనోహర్ వాడి గొంతులో తడబాటులేదు. చెప్పా నుగా వాడికి నా దగ్గర చనువెక్కువని.

"కూర్చో మామయ్యా" అంది లావణ్య. కొద్దిగా సిగ్గు! మామూలే!

నాకు కళ్లు దొరకలేదు. నా మొహం! కళ్లూ ఏముంది? అర్థమై పోవట్లేదూ? అబ్బాయీ అమ్మాయీ, ఏకాంతం!

కూర్చున్నాను.

"అందుకే అంత్రోపాలజీ చదవమం టున్నాను. ఏం బాబాయ్? బెస్టుకాదూ?" అన్నాడు మనోహర్.

ఓరీ! ఎంతలో మాట మార్చేశావురా? మీరిద్దరూ చీకట్లో డాబా మీద కూర్చుని ... గురించి మాట్లాడు కుంటున్నారూ? అని నన్ను నమ్మ మంటావూ? ఇంకేం జోకు తట్టలేదూ నీకు? ఈ కాలం పిల్లలు!

ఇదేమిటి నాకు? కొద్దిగా ఈర్ష్య? అందంగా అన్యోన్యంగా ఉన్న జంటని చూసి భరించలేక పోతున్నానా? జీవిత మంతా నాశనం చేసుకున్న నేను, ఎదుటివాడి జీవితం బాగుపడుతుంటే చూడలేక పోతున్నానా?

లేకపోతే లావణ్య అచ్చం లత లాగా ఉండడం వల్ల బాధనా? గతం గుర్తొస్తోంది. మేం పెళ్ళిచేసుకోలేక పోయాం. ఇప్పుడు వీళ్ళు స్వేచ్ఛగా, యథేచ్ఛగా ఉండడం భరించలేక పోతున్నానా?

బాధపడి ఏం చేస్తాను?

లావణ్యని పెళ్ళిచేసుకోనా? ·

అహ్హాహ్హా!

నవ్వైనా రావటం లేదేం? నిజంగా నాలో అలాంటి భావం ఉందేముటి?

లావణ్యకు పెళ్ళి! లావణ్యకు పెళ్ళి! లావణ్యకు పెళ్ళి!

ఎవరితో?

నాతోనే!

అహ్హాహ్హా!

నవ్వకు. నాలో ఏం తక్కువ?

మేజరుగా పనిచేస్తూ రిటైర్‌మెంట్ తీసుకున్నాను నిండా నలభై ఐదేళ్ళు లేవు నాకు కణతలుమాత్రం నెరిశాయి. ఎక్సర్‌సైజులతో ఒళ్ళు ఇనపముక్కలా గట్టిపడింది. ఈ సోటాల్డ్ యంగ్ మెన్స్ కంటె దృఢంగా నే ఉంటాను, అంతెం దుకు? ఈ మనోహర్ గాణ్ణీ, మూర్తి గాణ్ణీ చెరోచేతిలో పట్టుకుని గిరిగిరతిప్పి కింద పడెయ్యగలను

మనోహర్! మూర్తీ!

హఠాత్తుగా నా మనసు నాకర్థమైంది.

వీళ్ళిద్దరూ నా ప్రత్యర్థులు! వరసకి నాకు కొడుకులు. ఒక ఇరవై యేళ్ళ పడుచుకోసం వాళ్ళతో నేను పోటీ!

లావణ్యతో పెళ్ళి! ఎవర్ని, ఎలా, ఏ ముఖం పెట్టుకుని అడగను? ఏమని అడగను? అయ్యో!

* * *

మర్నాడు

అందరం భోజనాలుచేసి హాల్లో కూర్చున్నాం

పెళ్ళి టెన్షన్ తగ్గిపోయి, కబుర్లు వేళాకోళాల్లో పడ్డారు అందరూ.

నానారకాల విషయాల మీద కబుర్లు, గోవిందుని పిలిచి సిగరెట్లు తెమ్మన్నాను.

మర్చిపోయాను! గోవిందెవరో చెప్పలేదు కదూ? వాడొక అనాథ. మనోహర్ వాళ్ళింట్లో పెరుగుతున్నాడు. అన్ని పనులూ చేస్తుంటాడు వాడినిచూస్తే నాకు జాలి. ఈ నాలుగు రోజుల్లోనే నాదగ్గర వాడికి చనువైంది. సిగరెట్లు తెమ్మని రెండ్రూపాయల నోటిస్తే సిగరెట్లు ఇస్తాడుగానీ చిల్లర ఇవ్వడు. నేనూ అడగను. ఔదార్యం! అందుకే నేనంటే ఇష్టం వాడో బఫూన్.

వాడితో ఏవేవో మాటలు పెట్టుకుని నవ్వుతున్నారందరూ. కీ ఇచ్చిన కోతి బొమ్మలా ఎగురుతున్నాడు. పిల్లలందరూ వాళ్ళ వాళ్ళ తల్లుల దగ్గరగా కూర్చున్నారు. మాటల మధ్యలో చటుక్కున లావణ్య దగ్గరికి వచ్చాడు.

"అందరికీ అమ్మలున్నారు. నాకే ఎవరూ లేరు. మీలాంటి అమ్మ నాకు ఉంటే ఎంత బావుండు!" అన్నాడు లావణ్య చెయ్యి పట్టుకుని బిక్కమొహం పెడుతూ

పెద్దవాళ్ళని ఒక్కక్షణం నిశ్శబ్దం ఆవరించింది పిల్లలు మాత్రం యథావిధిగా గోలచేస్తున్నారు ముందుగా లావణ్యే తేరుకుంది

"నేన్నీకు అమ్మలాంటిదాన్నే కాదా!" అంది వాణ్ణిదగ్గరికి తీసుకుంటూ

నాకు గుండె నీరయిపోయింది జాలితో.

"మరి నాన్నో?" అన్నాడు గోవిందు

లావణ్య మొహం ఎఱ్ఱబడింది.

దుర్భరమైన నిశ్శబ్దం.

గోవిందు మొగాళ్ళనందరినీ పరీక్షగా చూశాడు. మనోహర్, వాళ్ళూ, వీళ్ళూ తర్వాత నేను.

ఒక్క క్షణం గుండె గుబ లాడింది. నాలుగు రోజులనుంచి వాణ్ణి ఆప్యాయంగా చూసుకుంటున్నాను. నా పేరు చెప్తాడా? నా మనసులో ఉన్న మాట బయటికి చెప్పేస్తాడా?

ఊహుఁ! అంత అదృష్టమా!

గోవిందు చూపులు నన్ను దాటేశాయి

"అలాంటి నాన్న కావాలి."

అందరం చూశాం మూర్తి! అపరాధిలా తల వంచుకున్నాడు.

లావణ్య చటుక్కునలేచి లోపలికి వెళ్ళిపోయింది.

"ఛీ! వెధవా! అవతలికెళ్ళు" అని గోవిందుని గద్దించారెవరో.

* * *

మర్నాడు.

పదిరూపాయల నోటిచ్చాను సిగరెట్లు తెచ్చాడు గోవిందుడు చిల్లర



ఇవ్వకపోయినా నోట్లు తిరిగి ఇవ్వక తప్పదుగా! జేబులోంచి బయటికి తీస్తుంటే కట్టగా ఐదులూ, రెళ్ళూ, ఒకట్లూ, బయటపడ్డాయి. కనీసం ఒక ఇరవై ఉండాలి వాడిదగ్గర.

ఆ నోట్లు చూడగానే నిన్నటి సంఘటనకి అర్థం గోచరించింది.

వీడు కమీషన్లు కొడతాడు.

నిన్న వీడు చెప్పిన మాటలు వీడి వయసుకి మించి, సినిమా డైలాగుల్లా ఉన్నాయి. చిలకలా, నాటకంలో పాత్ర దారిలా చెప్పాడు.

అప్పుడు జాలివేసినా, ఇప్పుడు అర్థం అవుతోంది.

ఎవరో చెప్పించారు.

ఎవరు?

ఇంకెవరు? 'తెలివైనవాడు' మూర్తి.

తను మన్మధుడేంకాదు. తను లావణ్యకి

తగదు ఒకవేళ నోరుతెరిచి అడిగినా మొహాన ఉమ్మేస్తారు అందుకే ఇన్ డైరెక్టుగా ఈ కుర్రకుంక చేత అడిగించాడు- లావణ్యకి మనసులో ఆ ఊహ పడాలని

ఓరి అసాధ్యుడా!! ఓరి నిర్భాగ్యుడా!!!

వెంటనే గోవిందు చెవ్వు మెలేశాను.

"చెప్పరా వెధవా? ఎవరిచ్చారు నీకు డబ్బు? ఆ మూర్తిగాడేనా?"

"లేదండీ! ఎవ్వరూ ఇవ్వలేదండీ."

"చంపేస్తాను వెధవా! చెప్పు మూర్తేనా?"

"కాదండీ"

చెయ్యెత్తాను.

"కొట్టకండీ! చెప్తానండీ! లావణ్య గారిచ్చారండీ!"

పక్షవాతం వచ్చినట్లు చెయ్యి పడిపోయింది. మొహం మొద్దుబారింది ఒళ్ళు వేడెక్కింది చెవుల్లోంచి రొదగా గాలి వీస్తున్నట్లనిపించింది.

నీరసంగా కుర్చీలో కూలబడ్డాను.

* * *

అయితే లావణ్యకు....

మూర్తంటే ఇష్టం.

మరి మూర్తికి...

లావణ్యంటే ఇష్టమయినా చెప్ప డానికి జంకాడు.

మరి లావణ్య....

చూపుల్తో ఎన్నో రకాలుగా తన ఇష్టాన్ని బయపెట్టినా, మూర్తి బెరుగ్గానే ఉండడంవల్ల 'నన్ను పెళ్ళిచేసుకో' అని అడిగెయ్యలేకపోయింది సిగ్గు ఎమ్మేస్సీ చదివినా

మరి గోవిందు

లావణ్య ఆడమన్నట్లు ఆడాడు చెప్ప మన్నవి చెప్పాడు.

మరి మనోహర్....

హారబడ్డావ్! ఆ రోజు మనోహర్ డాబామీద లావణ్యకు విజంగానే అంత్రో పాలజీ మీద లెక్చరిస్తున్నాడు. ట్రూ జెంటిల్‌మాన్. చీకటిగా ఉంది కదా అని ఆడపిల్లను కావలించుకునే రకంకాదు అతను లావణ్యకు స్నేహితుడు- బావ- ఆత్మీయుడు- అంతే!

మరి నేను....

యూ ఆర్ ఏ సెనైల్ ఓల్డ్‌మాన్

సిన్నిచూసి నువ్వే జాలిపడు.

మరి పెళ్ళి...

లావణ్య తెలివైనది. ఇక్కడిదాకా జాగ్రత్తగా లాకొచ్చిన విషయాన్ని ఇక ముందు మాత్రం వదిలేస్తుందా? మూర్తి తక్కువేంకాదు. ఇప్పటికీ విషయం వాడికి తలకెక్కి ఉంటుంది. వాళ్ళు బాగుపడతారు. నువ్వు బాధపడకు

మరి తరం....

మారింది. నోటితో అభిప్రాయం వ్యక్తంచెయ్యలేక జీవితాల్ని నాశనం చేసుకునే తరంకాదిది. ఈ తరపిల్లలు చదువుకుంటున్నారు, బాగుపడుతున్నారు తెలివిగా జీవితాలు దిద్దుకుంటున్నారు ఆశీర్వదించు